క్లుప్తంగా

కేజేపురం సంతోషిమాత తీర్థం రేపు

మాడుగుల రూరల్: కేజేపురం జంక్షన్‌లో సంతోషి మాత తీర్థం 24వ తేదీన నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ కాళ్ల అమ్మతల్లినాయుడు బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అన్నసమారాధన జరుగుతాయన్నారు. కబడ్డీ, ముగ్గుల పోటీలు, సాయంత్రం సంస్కాతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

24న ఉచిత మెగా వైద్య శిబిరం

మాడుగుల రూరల్: కింతలి-గాదిరాయి వాసవీక్లబ్ ఆధ్వర్యంలో ఈ నెల 24న జంపెన వాసవీమాత ఆలయంలో ఉచిత మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు క్లబ్ అధ్యక్షుడు మేడిశెట్టి అర్జున్‌రావు, జోన్ చైర్మన్ శ్రీనాథు కన్నయ్యశెట్టి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విశాఖకు చెందిన అనూ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూరో అండ్ కార్డియాక్ సైన్సెస్ వైద్య బృందంచే గుండె, అన్ని రకాల దీర్ఘకాలిక వ్యాధులకు సంబంధించి సూపర్ స్పెషాలిటీ వైద్యుల చేత ఉచితంగా ఆరోగ్య పరీక్షలు, ఈసీజీ, 2డీ ఈసీవో కార్డియోగ్రామ్ చేస్తామన్నారు.

సౌండ్ సిస్టమ్ వితరణ



సౌండ్ సిస్టమ్ అందిస్తున్న దృశ్యం

గొలుగొండ: స్థానిక గురుకుల కళాశాల విద్యార్థులకు నర్సీపట్నానికి చెందిన దొరబాబు సౌండ్ సిస్టమ్‌ను వితరణగా అందజేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ దొరబాబు సుమారుగా రూ. 25 వేల విలువ చేసే వస్తువులు వితరణగా ఇవ్వడం వలన 600 మంది విద్యార్థులకు ఎంతో ఉపయోగంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, విద్యాకమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పోటీ పరీక్షలతో పఠనాసక్తి



టాలెంట్ టెస్ట్‌లో పాల్గొన్న విద్యార్థులు

మాకవరపాలెం: పోటీ పరీక్షల ఏర్పాటుతో విద్యార్థుల్లో పఠనాసక్తి పెంపొందుతుందని ఎంఈవో నరేష్ అన్నారు. ఉగాదిసందర్భంగా గౌతమి లలిత కళా శిక్షణ కేంద్రం ఏర్పాటు చేసిన ప్రతిభా పాటవ పోటీల్లో భాగంగా విద్యార్థులకు బుధవారం ఉన్నత పాఠశాలలో టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. దీనికి మండలంలోని వివిధ పాఠశాలల విద్యార్థులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో శిక్షణ కేంద్రం అధ్యక్ష, కార్యదర్శులు రంగరాజు, శేషగిరిరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో గర్భిణులకు తనిఖీలు

మాడుగుల రూరల్: గర్భిణులకు బుధవారం ఆరోగ్య తనిఖీలు నిర్వహించారు. కింతలి, కేజేపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో నిర్వహించిన ఈ తనిఖీల్లో బీపీ, షుగర్, ఇతర పరీక్షలు నిర్వహించారు. కేజేపురం పీహెచ్‌సీలో డాక్టర్ శివప్రసాద్‌పాత్రుడు, కింతలిలో వైద్యాధికారి కేఎం నాయుడుతో పాటు ఇతర సిబ్బంది పరీక్షలు నిర్వహించి రోగులకు పలు సూచనలు చేశారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

220 మందికి ఉచిత కంటి పరీక్షలు



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న ఆప్తమాలజిస్ట్ నాగలక్ష్మి, సిబ్బంది

మాడుగుల: భారత నిర్మాణ్ సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో విశాఖ శంకర్ ఫౌండేషన్ వైద్యులు, సిబ్బంది బుధవారం స్థానిక పాల కేంద్రం సామాజిక భవనం వద్ద ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన 220 మంది బాధితులకు పరీక్షలు నిర్వహించారు.70 మందిని శస్త్ర చికిత్సలకు ఎంపిక చేయగా, చిన్నపాటి కంటి సమస్యలున్న వారికి ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఎడ్ల కళావతి, భారత నిర్మాణ్ సేవా ట్రస్టు సభ్యులు గౌరీపట్టపు మహేష్ కుమార్, కుక్కర మోదకొండ, సీహెచ్ మధు, మణికంఠ, జాగాని ఈశ్వరరావు, స్థానిక డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు, ఆప్తమాలజిస్ట్ నాగలక్ష్మి, క్యాంపు కోఆర్డినేటర్ అరుణకుమార్ తదితరులు పాల్గొన్నారు.

సామాజిక న్యాయంలో ఏపీ బెస్ట్

ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్



నర్సీపట్నం: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో దేశంలో ఎక్కడా లేని విధంగా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు పరిపాలనలో సముచితస్థానం కల్పించారని ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ పేర్కొన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ భావజాలంతో బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి సీఎం కృషి చేస్తున్నారన్నారు. శాసన మండలిలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు అగ్రపీటం వేశారన్నారు. పాదయాత్రలో వెనుకబడిన వర్గాలను చట్టసభల్లోకి తీసుకు వస్తానంటూ ఇచ్చిన వాగ్దానం మేరకు నేడు వారిని తన పక్కనే కూర్చునే విధంగా సీఎం జగన్‌మోహన్ రెడ్డి చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్నారన్నారు. దేశంలో రాజకీయ పార్టీలు బలహీనవర్గాలను ఓటు బ్యాంకుగా వాడుకుని వదిలేస్తున్నాయన్నారు. సీఎం దేశంలో ఎక్కడా లేని విధంగా వారికి పరిపాలనలో భాగస్వామ్యం కల్పించారని కొనియాడారు. సామాజిక న్యాయ సాధనలో సీఎం ముందుకు వెళ్తున్నారన్నారు. తాజాగా 18 స్థానాల్లో శాసనమండలి అభ్యర్థులను ప్రకటిస్తే అందులో 11 మంది బిసిలు, ఇద్దరు ఎస్సీలు, ఒకరు ఎస్టీకు కేటాయించారన్నారు. మంత్రివర్గంలో 70 శాతం బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీల వారికే మంత్రులుగా అవకాశం కల్పించారన్నారు. వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్లలో అధికశాతం బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు కేటాయించారన్నారు. సామాజిక న్యాయమే లక్ష్యంగా సీఎం పరిపాలన అందిస్తున్నారన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి ప్రజలు మరింత అండగా నిలవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

టెన్త్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేత



టెన్త్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేస్తున్న హెచ్ఎం ఉదయభాస్కర్ తదితరులు



మేడివాడ హైస్కూల్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందిస్తున్న దాతలు

దేవరాపల్లి: మండలంలోని ముషిడిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదవ తరగతి విద్యార్థులకు గ్రామానికి చెందిన రిటైర్డ్ టీచర్ డబ్బూరు కన్నయ్య సోదరులు సొంత సొమ్ముతో స్టడీ మెటీరియల్ సమకూర్చారు. ఈ మేరకు స్థానిక హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు ఉదయ్‌భాస్కర్, ఆంగ్ల ఉపాధ్యాయుడు పెద్దాడ వెంకటరమణ చేతుల మీదుగా బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం ఉదయ్‌భాస్కర్ మాట్లాడుతూ సమయాన్ని వృథా చేయకుండా దాతలు అందించిన స్టడీ మెటీరియల్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

రావికమతంలో..

రావికమతం: మండలంలోని భవిత కేంద్రంలో 10 మంది దివ్యాంగ విద్యార్థులతో పాటు మేడివాడ హైస్కూల్లో చదువుతున్న 84 మంది టెన్త్ విద్యార్థులకు చోడవరం 4జీఆర్ అన్నపూర్ణ ట్రస్ట్, వడ్డాది హెల్పింగ్ హార్ట్స్ డైరెక్టర్ తలారి అశోక్‌కుమార్, సకురు ఫౌండేషన్ డైరెక్టర్ సకురు కోటేశ్వరరావు సంయుక్తంగా రూ. 20 వేల విలువ చేసే స్టడీ మెటీరియల్‌ను బుధవారం మేడివాడ హైస్కూల్లో అందించారు. ఈ సందర్భంగా హెచ్ఎం జయలక్ష్మి మాట్లాడుతూ దాతలు అందించిన విలువైన స్టడీ మెటీరియల్‌ను విద్యార్థులంతా సద్వినియోగం చేసుకుని మంచి ఫలితాలు సాధించాలన్నారు. దాతలకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుడు మహాలక్ష్మినాయుడు, ఆయా సంస్థల సభ్యులు పాల్గొన్నారు.

హెడ్ కానిస్టేబుల్ కుటుంబానికి ఆర్థిక సాయం



మృతుడు రాంబాబు భార్యకు నగదు చెక్కు అందజేస్తున్న సహచర పోలీసు సిబ్బంది

నర్సీపట్నం: నర్సీపట్నం టౌన్ పోలీసు స్టేషన్‌లో రాంబాబు హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తూ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. అతనితో పాటు 1996లో విధుల్లో చేరిన పోలీసు సిబ్బంది అంతా రాంబాబు కుటుంబానికి అండగా నిలిచారు. విశాఖపట్నం సాగర్‌నగర్‌లో ఉంటున్న రాంబాబు భార్య పద్మావతికి రూ.3 లక్షల 50 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఎల్లప్పుడూ రాంబాబు కుటుంబానికి అండగా ఉంటామని వారంతా భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కోటి, త్రినాథ్, రామకృష్ణ, బాబాజీ, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు



ఐయితంపూడిలో మంచినీటి బోరును ప్రారంభిస్తున్న మహంతి

బుచ్చెయ్యపేట: గ్రామాల్లో మంచినీటి సమస్యలను నాయకుల సూచనల మేరకు పరిష్కరిస్తామని సీఎల్సీ చర్చి అధినేత ఎస్‌కే మహంతి తెలిపారు. బుధవారం ఆయన ఆర్ భీమవరం, ఐయితంపూడి గ్రామాల్లో సీఎల్సీ చర్చి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మంచినీటి బోర్లను మండల వైసీపీ నాయకులతో కలిసి ప్రారంభించారు. ఇప్పటికే బుచ్చెయ్యపేట మండలంలో 300కు పైగా మంచినీటి బోర్ల ఏర్పాటు, పలువురు మహిళలకు కుట్టుమిషన్లు పంపిణీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు కె. అచ్చింనాయుడు, జెడ్పీటీసీ సభ్యుడు దొండా రాంబాబు, ఎంపీపీ దాకవరపు నాగేశ్వరిదేవి, విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, మండల యాదవ, కాపు సంఘం అధ్యక్షులు నమ్మి అప్పలరాజు, ముచ్చకర్ల అప్పారావు, ఎంపీటీసీ, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు దేవర అప్పారావు, మరిసా నాని తదితరులు పాల్గొన్నారు.

ఫ్యామిలీ డాక్టర్ సేవలతో ఎంతో మేలు



మూలపేటలో ఫ్యామిలీ డాక్టర్ సేవలను అందిస్తున్న అనిల్‌కుమార్

మునగపాక : ప్రతి ఒక్కరూ ఫ్యామిలీ డాక్టర్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని మూలపేట సర్పంచ్ భీశెట్టి గంగప్పలనాయుడు కోరారు. మూలపేటలో స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేసిన ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా గంగప్పలనాయుడు మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వైద్యానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. ప్రజల ఇంటివద్దకే నేరుగా వైద్యులు వచ్చి ఆరోగ్య వివరాలు తెలుసుకునే మంచి కార్యక్రమం అందుబాటులోకి వచ్చిందన్నారు. డాక్టర్ అనిల్‌కుమార్ మాట్లాడుతూ సీజన్‌లో ప్రజలు ఆరోగ్య జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, పంచాయతీ పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

చెరువు అభివృద్ధి పనులు ప్రారంభం

ఎస్.రాయవరం : గ్రామాల్లో ఉన్న చెరువులు సుందరంగా తయారు చేసుకుంటే అహ్లాదకరమైన వాతావరణం నెలకొంటుందని ఈవోపీఆర్డీ సత్యనారాయణ అన్నారు. అనకాపల్లి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండలానికి ఒక చెరువును మోడల్‌గా తయారు చేసే పనులు చేపట్టామన్నారు. ఎస్.రాయవరం మండలంలో కొరుప్రోలు చెరువును ఎంపిక చేశామన్నారు. గ్రామం మధ్యలో ఉన్న చెరువు చుట్టూ చెత్తను తొలగించి, గట్టును సోమవారం పొక్లెయిన్‌తో చదును చేయించే పనులు చేపట్టారు. చెరువు చుట్టూ గట్టును చదును చేయించి వాకింగ్ ట్రాక్ మాదిరిగా తయారు చేసి, గార్డెన్స్‌ను పెంచేలా చేస్తామన్నారు.

అల్లూరి ఏ పార్టీ? విగ్రహానికి ముసుగెందుకో..



అల్లూరి విగ్రహానికి ముసుగు వేసిన మున్సిపల్ సిబ్బంది

నర్సీపట్నం: ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ నేపథ్యంలో మున్సిపల్ సిబ్బంది రాజకీయ నాయకుల విగ్రహాలతో పాటు విప్లవవీరుడు అల్లూరి సీతారామరాజు విగ్రహానికి ముసుగు తొడిగారు. ఈ సంఘటన బుధవా రం నర్సీపట్నంలో చర్చనీయాంశంగా మారింది. మున్సిపల్ అధికారుల ఆదేశాలతో వార్డు సచివాలయ సిబ్బంది పట్టణంలో విగ్రహాలకు ముసుగు లు వేసే కార్యక్రమం చేపట్టారు. అయితే అల్లూరి విగ్రహానికి ముసుగు వేయటంపై దారిన వెళ్లే వారు ముక్కున వేలేసుకున్నారు. విషయం తెలుసుకున్న మున్సిపల్ అధికారులు ముసుగును తొలగింపజేసి జరిగిన పొరపాటును సరిదిద్దుకున్నారు.

25 నుంచి గౌరీపరమేశ్వరుల ఉత్సవాలు

రోలుగుంట: ఈ నెల 25 నుంచి కొవ్వూరు గ్రామంలో నాలుగు రోజుల పాటు శ్రీ గౌరీపరమేశ్వరుల ఉత్సవాలు జరగనున్నాయి. ఉత్సవాలకు నిర్వాహకులు ఘనంగా ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా నిర్వహకులు విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 25న ఉత్సవమూర్తులను భక్తుల సందర్శనార్థం ఉత్సవ స్థలంలోని పల్లకిలో ఉంచుతామన్నారు. నాలుగు రోజులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఈ ఉత్సవాల విజయవంతానికి గ్రామస్థులతో పాటు వివిధ గ్రామాల నుంచి వచ్చే బంధువులు ఉత్సవ కమిటీకి సహకరించాలని నిర్వాహకులు కోరారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

రావికమతం: కొత్తకోట సబ్‌స్టేషన్ పరిధిలోని పలు గ్రామాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ట్రాన్స్‌కో డీఈఈ జి.సురేష్ బాబు బుధవారం తెలిపారు. కొత్తకోట సబ్‌స్టేషన్ అప్‌గ్రేడ్ మరమ్మతు లు చేస్తున్న కారణంగా ఆ రోజు ఉదయం 9 నుంచి సాయంత్రం ఆరు గంటల వరకూ సరఫరా ఉండదన్నారు. అలాగే రావికమతం సబ్‌స్టేషన్ పరిధిలో గురువారం సరఫరా నిలిపివేసి పనులు చేపడతామని, వినియోగదారులు గమనించాలని ఆయన తెలిపారు.

భూసర్వేతో సమస్యలకు స్వస్తి



ఎ.కోడూరు గ్రామసభలో మాట్లాడుతున్న తహసీల్దార్ రమేష్‌బాబు



రీ సర్వేను ప్రారంభిస్తున్న సర్పంచ్ అచ్చియ్యమ్మ

కె.కోటపాడు : పారదర్శకంగా నిర్వహించే జగనన్న శాశ్వత భూహక్కు-భూసర్వే కార్యక్రమానికి రైతులంతా సహకరించాలని తహసీల్దార్ జె.రమేష్‌బాబు అన్నారు. మండలంలో ఎ.కోడూరు గ్రామంలో బుధవారం భూసర్వే కార్యక్రమంపై రైతులతో గ్రామసభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు ఎ.కోడూరులో 1400 ఎకరాల భూమిని సర్వే చేస్తామన్నారు. సర్వే బృందాలకు రైతులు భూములను చూపించడంతో పాటు ఆధార్, పాస్‌పోర్టు ఫొటో, గతంలో గల భూమి పాస్‌బుక్ జెరాక్స్ కాపీలు, బ్యాంక్ అకౌంట్ నంబర్లు ఇవ్వాలని సూచించారు.



సిబ్బందికి సూచనలు చేస్తున్న తహసీల్దార్ కనకారావు

ప్రస్తుతం నిర్వహిస్తున్న భూసర్వేతో భవిష్యత్తులో ఎలాంటి రెవెన్యూ ఇబ్బందులు ఉండవన్నారు. రైతుల ప్రతి మడికి ఒక్కో కంప్యూటర్ పటాన్ని అందించనున్నట్లు తెలిపారు. మండల సర్వేయర్ రామచంద్రమూర్తి, వీఆర్‌వో బి.అప్పలరాజు పాల్గొన్నారు.

సక్రమంగా భూముల రీసర్వే చేపట్టాలి

నాతవరం: ప్రభుత్వ నిబంధనల ప్రకారం జగనన్న భూ రీసర్వేపై ప్రత్యేక దృష్టి సారించాలని తహసీల్దార్ పి. కనకారావు అన్నారు. బుధవారం భూ సమస్యలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. రీసర్వే పూర్తయితే ఎన్నో ఏళ్ల నుండి ఉన్న భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. మండలంలో 39 రెవెన్యూ గ్రామాలకు గాను ఇంత వరకు 38 రెవెన్యూ గ్రామాల్లో డ్రోన్ సర్వే పూర్తి చేశామని, రీసర్వే చేసేటప్పుడు ముందుగా రైతుల సందేహాలు నివృత్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ చైన్లు, ఆర్ఐ నారాయణరావు, సీనియర్ అసిస్టెంట్ డి.కృష్ణ, సర్వేయర్లు, వీఆర్వోలు పాల్గొన్నారు,

రీ సర్వేతో సమస్యల పరిష్కారం

మాకవరపాలెం: జగనన్న శాశ్వత భూ హక్కు పథకంలో చేపట్టిన రీ సర్వేతో రైతుల సమస్యలు పరిష్కారమవుతాయని కొండలఅగ్రహారం సర్పంచ్ పోలిరెడ్డి అచ్చియ్యమ్మ అన్నారు. ఈ గ్రామంలో బుధవారం చేపట్టిన డ్రోన్ సర్వేను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా సర్వేతో ప్రారంభించిందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ కృష్ణమూర్తి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

దేవరాపల్లి పీహెచ్‌సీ యూడీసీపై విచారణ



దేవరాపల్లి పీహెచ్‌సీలో రికార్డులు తనిఖీ చేస్తున్న అధికారులు

దేవరాపల్లి: దేవరాపల్లి ప్రభుత్వ ఆసుపత్రి యూడీసీ జేవీ మోహన్‌పై అనకాపల్లి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయ అధికారుల బృందం బుధవారం విచారణ చేపట్టింది. తమకు సంబంధించిన బిల్లులు సకాలంలో ప్రభుత్వానికి పంపించడంలో జాప్యం చేస్తున్నందున ఉద్యోగ రీత్యా భవిష్యత్‌లో తమకు నష్టం జరిగే ప్రమాదం ఉందని, స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారితో పాటు సిబ్బంది జిల్లా డీఎంహెచ్‌వోకు ఇటీవల లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. దీంతో డీహెంహెచ్‌వో విచారణకు ఆదేశించారు. ఈ మేరకు స్థానిక పీహెచ్‌సీలో డీఎంహెచ్‌వో కార్యాలయ ఇన్‌చార్జి ఏవో జి. సత్యనారాయణ, కార్యాలయ సూపరింటెండెంట్ బి.భాస్కరరావు, సీనియర్ అసిస్టెంట్లు ఎస్.సూరిబాబు, ఎం. సురేష్‌కుమార్ తదితరులు సమగ్ర విచారణ చేపట్టారు. యూడీసీ గదిలో రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. యూడీసీతో పాటు పీహెచ్‌సీ వైద్యాధికారి ఎస్.లలిత, సిబ్బందిని విచారించారు. అనంతరం విచారణ అధికారులు విలేఖరులతో మాట్లాడుతూ యూడీసీ మోహన్ దేవరాపల్లి పీహెచ్‌సీతో పాటు విశాఖపట్నం డీఎంహెచ్‌వో కార్యాలయంలో 2019 నుండి జిల్లాల విభజన వరకు అదనపు బాధ్యతలు నిర్వర్తించారన్నారు. ఈ క్రమంలోనే సిబ్బంది బిల్లలు పంపించడంలో జాప్యం జరిగిందని, ఇతనిపై ఇతర ఆరోపణలు లేవన్నారు. మార్చి 10లోగా లోపాలను సరి చేసి సిబ్బందికి ఎటువంటి ఇబ్బంది లేకుండా తగు చర్యలు తీసుకుంటామన్నారు. యూడీసీ మోహన్‌కు సహాయంగా గవరవరం పీహెచ్‌సీ యూడీసీని పంపిస్తామన్నారు.

పాడైన కోడిగుడ్ల బాక్స్ కాంట్రాక్టర్‌కు అప్పగింత



పాడైన కోడిగుడ్ల బాక్సును కాంట్రాక్టర్‌కు అప్పగిస్తున్న హెచ్ఎం అప్పారావు

రోలుగుంట: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం అమలులో భాగంగా విద్యార్థులకు సరఫరా చేసిన భోజనంలో కొందరికి కుళ్లిపోయిన కోడిగుడ్ల పంపిణీ జరిగింది. విషయం తెలుసుకున్న విద్యార్థుల తల్లిదండ్రులు ఆ గుడ్లు తింటే తమ పిల్లల పరిస్థితి ఏమిటని హెచ్ఎం అప్పారావును నిలదీసి ఆందోళనకు దిగారు. దీనిపై హెచ్ఎం వారితో సామరస్యంగా మాట్లాడి చల్లబరిచారు. అలాగే పంపిణీ జరిగిన గుడ్లు విద్యార్థులు తినకుండా నియంత్రణ చర్యలు తీసుకున్నారు. గుడ్లు సరఫరా చేసిన కాంట్రాక్టర్‌కు కబురు చేసి రప్పించారు. పాడైన గుడ్ల బాక్సును తిరిగి ఇచ్చేశారు.

సైన్స్‌డే విజేతకు రూ. 3 లక్షల నగదు బహుమతి

చోడవరం రూరల్: చోడవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సైన్స్‌డే ఉత్సవాల్లో భాగంగా నిర్వహించనున్న పోటీలో వినూత్న ఆవిష్కరణలు చేసిన విజేతకు రూ. 3 లక్షల నగదు బహుమతి అందచేస్తారని కళాశాల ప్రిన్సిపాల్ కె.రామచంద్రరావు తెలిపారు. ఈ మేరకు బుధవారం విడుదల చేసిన ప్రకటనలో ఈ నెల 27,28 తేదీల్లో 'స్టార్టప్'పోటీలు జరుగుతాయన్నారు. ఆసక్తి కలిగిన వారు ఈనెల 26లోగా తమ పేరు రిజిష్టర్ చేసుకోవాలని ప్రిన్సిపాల్ రామచంద్రరావు తెలియజేశారు.

రూ. 3.7 కోట్లతో ప్రతిపాదనలు



పైపులైన్ పనులను పరిశీలిస్తున్న ఏఈ శివారెడ్డి

మాకవరపాలెం: జల్‌జీవన్ మిషన్ పథకంలో రెండో విడతగా రూ.3.7 కోట్లతో ప్రతిపాదనలు పంపామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శివారెడ్డి తెలిపారు. మొదటి విడతలో జరుగుతున్న పనులను ఆయన బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లో ఇంటింటికీ తాగునీటి కుళాయిల ఏర్పాటుకు మొదటి విడతగా 67 పనులకు రూ.12.51 కోట్లు మంజూరయ్యాయన్నారు. వీటిలో 24 పనులు ఇప్పటికే పూర్తి చేశామన్నారు. రెండో విడతగా 21 పనులకు రూ.3.7 కోట్లతో ప్రతిపాదనలు పంపామని, నిధు లు విడుదల కాగానే ఆ పనులు కూడా ప్రారంభిస్తామన్నారు.

సచివాలయ ఉద్యోగులు బాధ్యతగా పనిచేయాలి



గుమ్మడిగొండ సచివాలయంలో రికార్డులు తనిఖీ చేస్తున్న యాదగిరీశ్వరరావు

నాతవరం: సచివాలయానికి వివిధ పనులపై వచ్చే ప్రజల పట్ల ఉద్యోగులు బాధ్యతగా వ్యవహరించాలని ఎంపీడీవో లోకుల యాదగిరీశ్వరరావు అన్నారు. ఆయన బుధవారం నాతవరం, గుమ్మడిగొండ సచివాలయాలను సందర్శించి రికార్డులు పరిశీలించారు. ఆయా గ్రామాల్లో జగనన్న లేఔట్లలో ఇళ్ల నిర్మాణాలను పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. ప్రజలు మండల కార్యాలయాలకు రాకుండా అన్ని రకాల ప్రభుత్వ సేవలు సచివాలయాల ద్వారానే అందిస్తున్నామన్నారు. వేసవిలో గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. ప్రజల నుంచి ఎలాంటి ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అంతరాయం లేని విద్యుత్ సరఫరాయే లక్ష్యం



నూతన బ్రేకర్లను పరిశీలిస్తున్న ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సురేష్‌బాబు

కె.కోటపాడు : విద్యుత్ సరఫరాలో వినియోగదారులకు ఎటువంటి అంతరాయం, ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు నర్సీపట్నం ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జి.సురేష్‌బాబు అన్నారు. కె.కోటపాడు సబ్‌స్టేషన్‌లో కె.కోటపాడు, సింగన్నదొరపాలెం, సూర్రెడ్డిపాలెం, ఎ.కోడూరు, పొడుగుపాలెం గ్రామాల ఫీడర్లకు సరఫరా జరిగే బ్రేకర్‌ల స్థానంలో రూ.15 లక్షలతో నూతనంగా కొత్త బ్రేకర్లను బుధవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బ్రేకర్ల ఏర్పాటు పనులను ఆయన పరిశీలించారు. ఇప్పుడు ఏర్పాటు చేసిన బ్రేకర్ల వలన వినియోగదారులకు మరింత నాణ్యమైన విద్యుత్ సరఫరా జరగనున్నట్లు తెలిపారు. ఈ పనులను చోడవరం డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ గౌరీప్రసాద్, ప్రాజెక్ట్స్ డీఈఈ సత్యారావు, కె.కోటపాడు ఎలక్ట్రికల్ ఏఈ ఎం.చంద్రశేఖర్, మండల లైన్‌మన్ యడ్ల ముత్యాలనాయుడు పరిశీలించారు.

దారమఠం హుండీ ఆదాయం రూ. 3.27 లక్షలు



హుండీ ఆదాయం లెక్కిస్తున్న దేవదాయశాఖ అధికారులు

గొలుగొండ: ప్రముఖ శైవక్షేత్రమైన దారమఠానికి మహా శివరాత్రి ఉత్సవాల సందర్భంగా రూ. 3.27 లక్షల ఆదాయం వచ్చింది. ఈ మేరకు బుధవారం దేవదాయ శాఖ అధికారులు లెక్కింపు నిర్వహించారు. మహా శివరాత్రి మూడు రోజుల పాటు హుండీ, దర్శనం టిక్కెట్లు, ఇతర రూపాల్లో ఈ ఆదాయం సమకూరినట్లు ఈవో మురళి తెలిపారు. ఈ నిధులు దేవదాయ శాఖకు జమ చేస్తున్నట్లు చెప్పారు. మహా శివరాత్రి ఉత్సవాలు ఘనంగా జరిగేందుకు సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.

నేడు కాశీ విశ్వేశ్వరుని కల్యాణం

మునగపాక: స్థానిక కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయంలో గురువారం విశాలాక్షి సమేత కాశీ విశ్వేశ్వర స్వామి కల్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ సూరిశెట్టి రాము, కోశాధికారి వేగి సాయిబునాయుడు తెలిపారు. ఆలయ ప్రాంగణంలో ఉదయం 11.22 గంటలకు వేద పండితులు సోమశేఖర శర్మ ఆధ్వర్యంలో కల్యాణం జరుగుతుందని తెలియజేశారు.